# పిన్ని

## కొండేపూడి నిర్మల

**ఈ వారం కథ**



'ఈవిడ మా పిన్ని...'

తలుపు తీసిన ముసలాయనకు పరిచయం చేశాడు రాజశేఖరం. ఎక్కబోతున్న మెట్టుదగ్గర ఆగిపోయి వెలవెలబోతున్న మొహంలోకి పెద్దరికం తెచ్చుకుంది కామేశ్వరి.

క్షణం క్రితం టాక్సీ దిగబోతూ ఆఖరిసారి కిటికీ అద్దంలోకి తొంగిచూసి రాజశేఖరం పక్కన తనెంత బావుందో అనుకోవడం గుర్తొచ్చి, ఆ పాపం షోవడా వికే అన్నట్టు...

'ఆయన రాలేదు. వీడు మా పెద్దాడు. ఆదే మీ కాబోయే అల్లుడు. పొద్దున్నే ఇబ్బంది పెడుతున్నామా...?' అంది ఎవరో తరుముకొస్తున్నట్టు–

'భలేవారే రండ్రండి కూచోండి'– అన్నాడుగావీ



ఎటు రమ్మనాలో, ఎక్కడ కూచోపెట్టాలో ఆ పెద్ద మనిషికి తోచలేదు. దాదాపు అన్ని గదుల్లోనూ పరుపు వేసుకుని దొర్లుతున్న జనాభా కనిపించి మొహమాటంగా ఆగిపోయారిద్దరూ.

'ఇవాళాదివారం కిదా రాత్రి పన్నెండింటిదాకా ఏవో సినిమా కేసెట్లూ అవీ చూసి...' అన్నాడాయన సంజాయిషీగా, సోఫాలో ముసుగుపెట్టిన శాల్తీని తట్టి లేవుతూ–

'ఒద్దొద్దు వాళ్ళందర్నీ లేపకండి' అంటూ గోడపక్కనున్న మడత కుర్చీలు రెండు అందుకుని ఇంటిముందు వాల్చింది కామేశ్వరి చొరవగా.

'అయ్యో మీరు చెయ్యకండి. అమ్మా మీరు ఆగండి' అంటూ ఖంగారుపడుతూ–

'ఇదిగో ఏమేవ్' అనరిచి లోపలికి పరిగెత్తాడాయన.

'చెబుతూనే ఉన్నానా ఇంత పొద్దున్నే వచ్చి వాళ్ళనిబ్బంది పెట్టాం మనం' అంది కామేశ్వరి కుర్చీలో కూలబడి.

'వెళ్ళిపోదాం. మన పనెంతసేపు కాటరింగువాడి అడ్రస్ ఇవ్వాలనే కదా మనం వచ్చింది' అన్నాడు రాజశేఖరం.


ఆ మాత్రం దానికి ఫోన్ చేస్తే చాలదా అనబోయి అతని మొహం చూసి ఊరుకుంది.

రాజశేఖరం కళ్ళు తెరిచిన తలుపుల గుండా లోపలికి దూసుకుపోయి ముసుగుతన్నిన జనాభాలో రోజారాణి ఎక్కడుండి ఉంటుంది అనే విషయం తేల్చుకోవాలన్నట్టుగా ఉన్నాయి. కాటరింగూ కాదూ గోంగూరా కాదు. కాబోయే పిల్లను ఇంకోసారి చూద్దామని... అనుకోగానే కామేశ్వరి గుండె భగ్గుమంది.

అసలు నిన్నరాత్రి భోజనాల దగ్గర పెళ్ళికూతురికేరంగు పట్టుచీర తేవాలనే ప్రసక్తి వచ్చినప్పుడే రాజశేఖరం మైకంలో పడినట్టు పరధ్యాన మైపోడం, ఆ వెంటనే మళ్ళీ 'పెళ్ళికూతుర్ని నువు చూడకపోడమేమిటి పిన్నీ అక్కడందరూ నిన్నే అడుగుతున్నారు. రేపొద్దున్నే తీసుకెడతాను. కాటరింగువాడి అడ్రస్సు కూడా ఇచ్చేద్దాం, అన్నప్పుడే అర్థమైపోయింది. ఇది పిల్లమీద యావే తప్ప పిన్ని మీద శ్రద్ధ కాదని.

అంచేతే నేరాను రావంటూ చాలాసేపు మొండికేసింది. ఏవేవో పన్లున్నాయంది. నాదేముంది మీరూ మీరూ చూసుకున్నాక– అంది. మీ అమ్మే ఉంటే ఆ హక్కు లేదు. నేనెంతయినా మధ్యలో వచ్చిందాన్ని అంటూ అనవసరంగా నిష్ఠూరపడింది. చూస్తుండగానే కళ్ళు నిండుకొస్తే






కొంగుతో అద్దుకుంది. కామేశ్వరి నిష్ఠూరం వెనుక అమె దెబ్బతిన్న అహం గుర్తించి సిన్సియర్‌గానే బాధపడ్డాడు రాజశేఖరం.

చెట్టంతటి మనిషి క్షమించమన్నట్టు మొహం వేలాడేసుకుని కనిపించ డంతో కామేశ్వరికి చెప్పలేనంత శాంతిగా అనిపించింది. ఆ మొహాన్నలాగే దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకుంటేనో అనిపించింది. ఆ పని ఎక్కడ చేసేస్తానో అనే భయంతో దృష్టి మళ్ళించుకుని

'కొంచెం సాంబారు కలుపుకో అదేం తిండి' అని కసిరింది.

'ఏ విషయం చెప్పనురి' అంటున్నట్టు చూస్తున్నాడు రాజశేఖరం.

'ఎన్నింటికి బైల్దేరాలంటావు ఎండలో తిరగడం నావల్ల కాదు ముందే చెప్తున్నాను' కరాఖండీగా అంది.

'పువ్వుల్లో పెట్టి తీస్కెడతాను నీకెందుకు పది గంటలకల్లా మనింట్లో ఉంటాం సరేనా' అన్నాడు సంతృప్తిగా.

'అలారా దారికి–' అనుకుంది కామేశ్వరి. పువ్వుల్లో పెట్టి తీస్కెడతాను అన్నమాట ఆ రాత్రి, చాలాసేపు కలవరపెట్టింది. పక్కనే పడుకున్న ముసలి భర్త మరింత ముసలిగానూ, ఇరుకుగది మరింత ఇరుగ్గానూ, అసలే అందమైన తను మరింత అప్సరసలాగానూ అనిపించి,

కాదుమరీ నేను పువ్వుల్లో పెట్టి చూసుకోవలసినదాన్నే కదా. అంతా కలిసి నాగొంతు కోశారుగాని, లేపోతే వందమంది రాజశేఖరాలు నాచుట్టూ తిరగరా అనుకుని విధిని శపించింది. కళ్ళమ్మట నీళ్ళెట్టు కుంది. ముప్పయ్యేళ్ళు ఆరేళ్ళ క్రిందటే వెళ్ళిన కామేశ్వరి యాభైతొమ్మిదేళ్ళ మనిషికి భార్యగా అరుగురు సవతి పిల్లలకు తల్లిగా చిటికెలో పెద్ద ముత్తయిదువ వేషం కట్టగలదు. నిమిషం ఏమరుపాటు దొరగ్గానే ఇరవయ్యేళ్ళ పిల్లకుమల్లే కలల మీద కలలు కని అలిసిపోనూ గలదు. దానికితోడు భర్త పెద్దకొడుకైన రాజశేఖరం ఆర్మీ నుంచి వచ్చింది మొదలూ కామేశ్వరి కలలుకొక ఆయువుపట్టు దొరికినట్టనిపించింది. తనకు మాత్రమే పరిమితమైన ఆ రహస్యపు వేదన ఉత్తుత్తి చాపల్యం కాదుసుమా అని నచ్చజెప్పుకునేందుకుగ్గాను అతని వ్యక్తిత్వంలో ప్రతిచిన్న విషయాన్ని అద్భుతం అనుకున్నట్టు చూసేది. అతను మాట్లాడినా, మాట్లాడకపోయినా, నవ్వినా, నడిచినా ఒక ప్రత్యేకత ఆపాదించి చూసేది.

రాజశేఖరానికిదంతా ఏమీ తెలిసేది కాదు. 'ఈ నాన్నగార్కైనా బుద్ధుం డక్కర్లేదూ ద్వితీయం చేసుకుంటే మటుకు మరీ అంత చిన్నావిడ్నా. పాపం ఆవిడ మొహం చూస్తేనే జాలేస్తుంది' అనుకునేవాడు ఎవ్వడైనా.

తన ఈడుదే అయినా ఆవిడ్ని పిన్నీ అవడానికి నోరురాక, కామేశ్వరీ అనడానికి వరస ఒప్పక చాలా రోజులపాటు ఇబ్బంది పడ్డాడు. ఈ దశలో ఓరకంగా కామేశ్వరి పట్టుబట్టి అతన్ని పదేపదే మాట్లాడిం

చేది. ఇంటికి పెద్దకొడుకుగా గౌరవించి పిల్లల చదువుల దగ్గర్నించి, సాహిత్యం దగ్గర్నించి రాజకీయాల దాకా అన్ని విషయాల్లోను అభిప్రాయాలడిగి బెదురు పోగొట్టింది. ప్రియుడవదగిన అర్హతల్లో ఉన్నవాణ్ని కొడుకని వచ్చజెప్పకోడంలో ఉన్న హింస మౌనంగానే భరించింది. ఇప్పటికీ మనసప్పుడప్పుడు ఎదురు తిరుగుతూనే ఉంటుంది. అదిగో అలాంటప్పుడే రోజంతా తిక్కతిక్కగా ప్రవర్తిస్తుంది.

వువ్వుల్లో పెట్టి తీస్కెడతాను [illegible] కూడా [illegible] నీళ్ళొచ్చాయి.

అంతా అబద్ధం, పచ్చిమోసం, దగా, కుట్ర– అరవాలనిపించడాన్ని బలవంతాన అణచేసుకుని కణతలు నిమురుకుంటూ ఉండిపోయింది. ఏమో... ఒకవేళ ఏమయినా చెప్పదల్చుకున్నాడేమో. అందుకే ఈ ప్రయాణం పెట్టాడేమో ఎలాగైనా మిగతా పిల్లలందరిలోనూ ఇతనికే తనంటే ఏదో ఇది. టాక్సీలో సగం దూరం వెళ్ళాక ఓ చెట్టుకిందెక్కడో ఆపేసి– 'పిన్నీ... ఛ కాదు కామేశ్వరీ నువ్వంటే నాకిష్టం. చెప్పే అవకాశమే రావడం లేదు. నువ్వు మా మావ్వలాంటి ముసలాయనకు భార్యగా కాకుండా, నాకే ముందు ఎందుకు కనిపించలేదు చెప్ప' అంటాడేమో బాధగా పోనీ అలా వద్దు సగం దూరం వెళ్ళాక కారే ఏ చెట్టుకో డాషిచ్చి ముందు సీట్లో ఉన్న తామిద్దరూ భయంతో ఒకరిలోకి . ఒకరం ఒదిగిపోయి... ఈ జన్మకది చాలదూ.

ఛఛ అలా ఎప్పుడూ జరగదు. జరగకూడదు బాబూ– హయ్యో– నాకేదో అయ్యింది. బుర్ర పగిలిపోతోంది. గోడకేసి బాదుకుంటే ఎన్ని ముక్కలవుతుందో. తలముక్కలైతే ఈ పెళ్ళాగిపోతుందా?

తెల్లవార్లూ కామేశ్వరి కుతకుతలాడుతూనే ఉంది. తెల్లారేసరికల్లా తలస్నానం చేసేసి, చేనేత జరీచీర కట్టుకుని పెద్దమనిషి కిరీటం పెట్టేసుకుంది. నున్నగా తలదువ్వుకుని సిగమీద కుడివైపు గులాబీ వువ్వు చెక్కినప్పుడు కూడా 'ఎలాగైనా తను వెరీనైస్' అనుకుంది. ఈ మాట రాజశేఖరం అంటే ఎలా ఉంటుందో ఒక ఊహ కూడా చేసింది.

ఛఛ నా అందం గురించి నువ్వలా మాట్లాడకూడదు శేఖరం. అసలందం శాశ్వతమా చెప్ప అయినా నాన్నగారికేం తక్కువ. మనసుకి వయసడ్డం రాదు. నేను మీ ఇంట్లో సుఖంగానే ఉన్నాను సరేనా అనాలి. ఔను అలా అంటేనే మర్యాదగా ఉంటుంది. అతనిక్కొంచెం పగ్గాలేసినట్టు కూడా ఉంటుంది. గట్టిగా నిర్ణయం చేసుకుంది కామేశ్వరి. విజయవాడ నుంచి తెనాలి వస్తున్న గంట దూరంలోనూ పైన ఊహించిన ఒక్క ప్రమాదమూ జరగలేదు సరికదా.

'ఉత్తి చేతుల్తో పెళ్ళి వాళ్ళింటికి వెడితే బావుండదేమో వూలు, పళ్ళూ తీసుకుందామంటావా, అంటూ ఓసారి కారాపినవుడు.

'ఇంత పొద్దున్నే ఏంవద్దు ముందు పద' కసిరింది అనుకోకుండా.

'ఇంకోసారి కాఫీ తాగుతావా' అంటూనే.

ఫ్లాస్క్ మూతలోకి పోసిచ్చినప్పుడు.

అబ్బా... ఏం కాఫీ అది కడుపులో తిప్పతోంది. వాసన చూసి పక్కకి పెట్టేసింది.

రాజశేఖరం ముక్కు దగ్గర పెట్టుకుని చూశాడు. వాసనేం లేదే అని ఆశ్చర్యపోలేదు.

కామేశ్వరికింకా కోపం తగ్గలేదనే విషయం మాత్రం అర్థమైపోయింది.

ఆ తర్వాత వాళ్ళిద్దరి మధ్యా విశేషంగా ఒక్కమాట లేదు.

'హళ్ళో గుడ్మార్నింగ్ రాజా హబ్బ హేవిటింత పొద్దున్నే..' అంటూ ఆవలిస్తూ నైటీ సరిచేసుకుంటూ వచ్చింది పెళ్ళికూతురు రోజారాణి.

'హేవిటింత పొద్దున్నేనా..! తోచక–' ఆ పిల్లను అనుకరిస్తూ నవ్వి నెత్తిమీద ఒక మొట్టికాయ వెయ్యబోయి మానేసి–

మర్చిపోయావా మట్టిబుర్ర 'కాటరింగు విషయం చెప్పడానికి వస్తానన్లేదూ... చూశావా పిన్నీ ఈవిడే నీ కాబోయే మందబుద్ధి కోడలు' అంటూ గారాతిగారంగా పరిచయం చేశాడు రాజశేఖరం.

'నమస్తే పిన్నిగారూ' అందాపిల్ల అప్పడే తనని చూసి వెంటనే నాలిక్కరుచుకుని–

'ఏమిటేమిటీ మళ్ళీ పిలు. ఆవిడ నీకేమవుతుందీ పిన్నిగారా, అత్తగారా వరసలు కూడా తెలీవండీ పిల్లకి' అన్నాడు వెక్కిరింతగా–

'ఆంటీగారు' అందాపిల్ల.

'ఏమో అనుకున్నాను గడుసుదానివేనే' అంది కామేశ్వరి.

[illegible]

నిజానికి కామేశ్వరికీ తెలీదు ఏదో అనాలి కదా అన్నట్టు అంది కానీ ఆ మాటకింత పదునెలా వచ్చిందో ఊహించలేదు. ఓ రంగూ లేదు, ఒడ్డుపొడుగూ లేదు, మొహమూ అంతంత మాత్రమే పైగా చప్పిడి ముక్కు, కళ్ళు సరే అనుకో. నోరు బావుంది లక్కపిడతలా. మాట జోరూ ఇప్పడే విన్నాం. ఇంతోటి రంభ కోసమేనా ఈ నలకూబరుడు నిశ్శ నిద్రా పట్టకుండా కలవరిస్తున్నదీ 'హారి దేవుడా' అనుకుంది కామేశ్వరి.

ఆ మాట అప్రయత్నంగా బైటికొచ్చింది కూడా. ఏం జరిగిందన్నట్టు చూశారు వాళ్ళిద్దరూ. లాభంలేదు అసలు తనుండబట్టి ఊరుకున్నారు గానీ అంత బాహాటంగా అరుబైట కుర్చీలో ఆ ఇద్దరూ అమాంతం... ఛీఛీ ఇంత సిగ్గుమాలినతనం తనెప్పుడూ చూళ్ళేదు. హారి దేవుడా మళ్ళీ గొణగబోయి బలవంతాన మింగేసింది.

దేవుడు ప్రత్యక్షమవలేదుగానీ ఇంటావిడ కాఫీ ట్రేతో బైటికొచ్చింది. ముసుగుల కింద నిద్రలన్నీ లేచిపోయుండాలి. కుర్చీలు, బల్లలు సర్ది ఉంచిన న్యూస్ పేపర్లతో ముందుగదికి డ్రాయింగ్ రూం సెట్టింగ్ తయారయ్యింది. ఊడిపోయిన పోనీటెయిల్‌తో బొందుల్లేకుండా లూజు లూజుగా వేలాడే పల్చటి నైటీతో రాజశేఖరం మీద పడిపోయి మాట్లా


★ రిస్టువాచ్ ఫ్రీగా పొందండి
కేవలం రూ.300/ - లకే ఆకర్షణీయమైన
జపాన్‌మోడల్ 8 నం. లు గ్యారంటీ
మా స్కీము ద్వారా కేవలం రూ.300/-లకే
లభ్యం. పోస్టేజి అదనం.
MAHADEV TRADING CO.,
P.O. MAIRA BARITH (GAYA)
ఆటోమేటిక్ టాయ్ రివాల్వర్

MARSHAL ZORO
Rs. 175/-
50 షాట్లు ఉచితం

BULLET ZORO
Rs. 270/-
పోస్టల్ ఛార్జీలు అదనం
పోస్టల్ చార్జీలు అదనం
★ రిస్టువాచ్ ఫ్రీగా పొందండి
★ లైసెన్స్ అవసరం లేదు
★ పిల్లలకు అపూర్వమైన బహుమతి
★ మహిళలకు ఆత్మరక్షణ కొరకు
మార్షల్ జోరో మరియు బుల్లెట్ జోరో తుపాకులు మీకు పూర్తి రక్షణనిస్తాయి. పిక్‌నిక్‌ల కొరకు, డ్రామాలలో, షూటింగ్‌లకు ప్రయాణాలలో మరియు జంతువుల బారి నుండి రక్షించుకొనుటకు పొగలు విరజిమ్ముతూ ప్రేలే తుపాకి. వెంటనే మీ ఆర్డర్లను పంపించండి.
ISHWAR TRADERS (J)
P.O. : MAIRA BARITH (Gaya)

డతున్న కూతుర్ని ఆ కూతురికేసి వింతగా చూస్తున్న అత్తగార్ని చూసి ఖంగుతిని అంతలోనే సర్దుకుని అవిడే అంది–

'అమ్మడూ స్నానం చేసి రెడీ అయివచ్చి మాట్లాడుకుందువుగాని లోపలికి రామ్మా'

ఏ కళనుందోగానీ నో అనకుండా 'ఎస్..మా' అంటూ గారంగా బదులువలికి ఒన్ మినిట్ అంటూ రాజశేఖరానికోసారి కన్నుకొట్టి లోపలికి వెళ్ళింది రోజారాణి.

'బావుంది నాయనా పిల్ల... మర్యాదా... అదీ...' అర్థోక్తిగా ఆగింది కామేశ్వరి కావాలనే–

'తనకేం తెలీదు పిన్నీ ఉత్తి అమాయకురాలు. చిన్నప్పట్నించీ బాంబేలో పెరిగింది' అన్నాడు తప్పంతా బాంబేదే అయినట్టు–

'అది సర్లే' అని కాసేపాగి 'ఎండెక్కిపోడం లేదూ కదలాలి మనమింక పోని నే వెడతాను. నువ్వు తరువాత వద్దువుగాని...' చాలా అర్థం చేసుకుని క్షమిస్తున్నట్టు అంది.

'నో నో నో వెళ్ళిపోదాం ఇప్పటికే ఆలస్యమైంది అవునవును' అంటూ తన జేబులో ఉన్న కాటరింగు అడ్రసు మామగారి చేతికిచ్చి వచ్చాడు హడావిడి తెచ్చుకుని.

నువ్వసలు ఇవాళ కదుల్తావో లేదో నాకేం తెలుసు– అన్నట్టు నిర్లిప్తంగా కూచుంది కామేశ్వరి.

రాజశేఖరం మొహంలో అది నవ్వా సిగ్గా పెళ్ళికుదరడం మొగాళ్ళ క్కూడా ఇంత వెలుగు తెచ్చిపెడుతుంది కామోసు. విస్తుపోయి చూస్తూనే మళ్ళీ వెలుగెందుకో స్ఫురించి అది ఇముడ్చుకోలేనట్టు బాధగా కణతలు నొక్కుకుంటూ ఉండిపోయింది.

'ఎక్కువగా ఉందా పిన్నీ. మళ్ళీ ఆ తల్నొప్పేనా జోడు మార్చమంటే వినవు నువ్వు. ఇవాళింక నీ మాట నమ్మదల్చుకోలేదు నేను. పద ముందు ఆస్పత్రి కెడదాం' కారెక్కబోతూ అడిగాడు రాజశేఖరం.

'వొద్దొద్దు' తల అడ్డదిడ్డంగా తిప్పింది.

'ఎందుకని!' ఈసారి ఆవుకోలేనంత కోపంగా అన్నాడు.

'ఎందుకంటే... ఏం లేదు... ఎప్పుడేనా టెన్షన్ ఉన్నప్పుడు అలా వస్తుంది, పోతుంది. పది రోజుల్లో కొడుకు పెళ్ళంటే...' మాటలు తడుముకున్నట్టు కాస్సేపాగి.

'పెద్దవాళ్ళం అవుతున్నాం కదా నాన్నగారూ నేనూ ఇలాంటివి మామూలే. ఊరంతా వచ్చిపడతారు. కదా ఎలా మర్యాద చేసి పంపాలో ఏమో, తనవి కాని మాటల్లా ఒక్కో ముక్కా ఆచితూచి అప్పజెప్పింది కామేశ్వరి.

'ఓస్ ఇంతేనా ఈ మాత్రం దానికి అంత కంగారా? మీ ఆడవాళ్ళెప్పుడూ ఇంతే పిన్నీ ఏదీ దాచుకోలేరు. అంటారుగా మీ నోట్లో నువ్వుగింజ నానదని... నిజమేనా... ఒప్పుకుంటావా' పడీ పడీ నవ్వుతున్నాడు రాజశేఖరం.

కామేశ్వరి కూడా నవ్వడానికి శతవిధాల ప్రయత్నించింది. కానీ అది నవ్వులా కాక పగిలిన గాయంలాగా కనిపించింది కిటికీ అద్దంలో....

## "ప్రథమం ఆవలించడం..."

ఆదిభట్ల నారాయణదాసు గారు గొప్ప హరి కథకులు. అసలు వారు హరికథా పితామహులుగా ప్రసిద్ధి పొందారు. వారు ఆ రోజుల్లో హరి కథలు చెబుతూ వుంటే ప్రజలు ఎంతో శ్రద్ధగా వినేవారు ఆసాంతం. నారాయణదాసుగారు కథకులే గాక కవి, పండితులు చక్కటి చమత్కారికూడా. దాంతో వారు పిట్ట కథలతో హాస్యోక్తులతో అభినయిస్తూ హరికథాగానం చేస్తుంటే జనం వేలం వెర్రిగా వచ్చి వారి కథలు శ్రద్ధగా ఆలకించేవారు.

అటువంటిది– ఒకసారి ఒక గ్రామంలో నారాయణదాసుగారు హరికథ చెబుతున్నారు. ప్రారంభించిన కొద్ది సేపటికే ముందు వరసలో కూర్చున్న ఒక శ్రోత 'ఆ' అంటూ ఆవలించాడు. అది గమనించిన దాసుగారు సమయస్ఫూర్తిగా– ప్రథమం ఆవలించటం–ద్వితీయం కాళ్ళు బార చాపటం, తృతీయం తూళిపడటం– చతుర్థం లేచిపోవటం" అంటూ అభినయ పూర్వకం ఓ పద్యం అందుకున్నారు. దాంతో ఆవలించిన శ్రోతేగాక మిగతా వారుకూడా చప్పట్లు కొట్టి హరికథ శ్రద్ధగా వినటం ప్రారంభించారు.

అలాగే మరోసారి హరికథ మంచి ముక్కంపట్టులో వుంది. శ్రోతలు శ్రద్ధగా వింటున్నారు. ఇంతలో ఒక వ్యక్తి జనాన్ని నెట్టుకుంటూ వచ్చి ముందు వరసలో కాసేపు మాత్రమే కూర్చొని మళ్ళీ జనాన్ని చీల్చుకుంటూ వెళ్ళిపోతున్నప్పుడు నారాయణదాసుగారు ఆ వ్యక్తి రావటం పోవడం గురించి చమత్కారంగా– పుట్టుకతోనే గిట్టినట్లు కొందరీ లోకంలోకి ఎందుకు వస్తారో ఎందుకు పోతారో ఆ భగవంతుడితే తెలియాలి" అనేటప్పటికి జనం చప్పట్లతో హోరెత్తించారట.

–వేమూరి జగపతి రావు

